# వి భ్ర మ

తనకు పిచ్చెక్కేలా ఉంది.

కొంతకాలంగా తనకు ఇలాగే అన్పిస్తోంది. తనలోని పిచ్చి లక్షణాలు తనకే కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి.

నిజంగా తనకు పిచ్చెక్కుతుందా? లేదు లేదు. అంతా తన భ్రమ. తన మాటల్లో గానీ చేతల్లో గానీ పిచ్చి లక్షణా లుంటే ఇంట్లో వాళ్ళకు కన్పించవా? ముఖ్యంగా తన భర్తకు... ఆయనతో ఒకటి రెండుసార్లు అన్నది కూడ. 'నాకు పిచ్చెక్కేలా ఉంది' అని. ఆయన విన్పించుకోలేదు.

అంటే తనలో ఎలాంటి అసహజమైన లక్షణాలు ఏర్పడలేదనేగా? మరి తన కెందుకిలాంటి భయం పట్టుకుంది. భయం కాదు నిజమే. తనకు ఏ క్షణంలోనైనా పూర్తిగా పిచ్చెక్కొచ్చు. ప్రతి నిమిషం తన బుర్రలో ఏదో సజ్జన్నం లాగ కుతకుత ఉడుకుతున్నట్టుగా అన్పిస్తూ ఉంటుంది.

ఆయన విన్పించుకోవడం లేదు. కాని ఒక రోజు తప్పక పశ్చాత్తాపపడ్తాడు. ఒక ఫైన్ మార్నింగ్ ఆయన నిద్ర లేచేసరికి జుట్టు విరబోసుకొని పిచ్చిగా నవ్వుతూ కన్పిస్తే ?

అనూరాధ తృళ్ళిపడింది. ఆమె కళ్ళ ఎదుట ఆమె రూపమే — పిచ్చిగా జుట్టు విరబోసుకొని నిల్చున్నట్టుగా తోచింది. కెవ్వున అరవబోయి తమాయించుకున్నది.

అనూరాధ దిగ్గున లేచింది. డైనింగ్ హాల్లోకి పరుగు తీసింది. కిటికీలో పెట్టవున్న ఇస్త్రీ చేసే పెట్టెకేసి చూసింది. అది కింద నేలమీదకు వేలాడుతోంది. బల్లమీద బట్టలేవీ లేవు. గుండెమీద అరచెయ్యి పెట్టుకొన్నది. దడ తగ్గింది. రిలీఫ్‌గా గుండె నిండుగా గాలి పీల్చుకొన్నది.

అసలు ఇవ్వాళ తను బట్టలు ఇస్త్రీ చెయ్యలేదు. తనకు అనుమానం ఎందుకొచ్చింది. ఈ మధ్య తరచు తనకు అలాగే అన్పిస్తోంది. ఇస్త్రీ చేస్తూ చేస్తూ, అలాగే బట్టలమీద దాన్ని వదిలేసి మరో పనిమీద ఇవతలకి వచ్చినట్టూ, ఆ తర్వాత దాన్ని గురించి పూర్తిగా మర్చిపోయినట్టూ, అప్పుడే అకస్మాత్తుగా గుర్తొచ్చినట్టూ అన్పిస్తూ ఉంటుంది. పైగా బట్టలు కాలుతున్న వాసన కూడా వచ్చినట్టే అన్పిస్తుంది. మరి ఇవన్నీ ఏమిటి? పిచ్చి లక్షణాలు కావూ? మరోసారి కిటికీలో ఉన్న ఇస్త్రీ పెట్టెను చూసి అక్కడ్నుంచి కదిలింది అనూరాధ.

అనూరాధకు కొద్దికాలంగా తనకు పిచ్చెక్కుతుందేమో నని అనుమానం పట్టుకున్నది. అనూరాధ భర్త ఒక ప్రైవేట్ కంపెనీలో సేల్స్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు. పెద్దపిల్ల సమత. జూనియర్ కాలేజీలో చదువుతోంది. రెండోవాడు మగపిల్లవాడు. వాడి పేరు రాకేష్. వాడు పబ్లిక్ స్కూల్లో చదువుతున్నాడు. అనూరాధ చాలాకాలంగా అప్పుడప్పుడూ కథలు వ్రాస్తూ ఉంటుంది. వ్రాసింది తక్కువే అయినా ఆమెకు రచయిత్రిగా గుర్తింపు వచ్చింది.

"నాకు పిచ్చెక్కేలా ఉంది" అన్నది రెండు మూడు సార్లు భర్తతో అనూరాధ.

"అందరికీ అలాగే ఉందిలే. ఇక్కడ పిచ్చెక్కందెవరికి?" అంటూ విసుక్కున్నాడు ఆమె భర్త రఘు. కొంతకాలంగా ఆయన మూడ్ సరిగా లేదని అర్థం చేసుకున్న అనూరాధకు అంతకంటే ఎక్కువ మాట్లాడే ధైర్యం లేకపోయింది. ఆతనికి రావాల్సిన ప్రమోషన్ మరొకరికి ఇచ్చారని, కోర్టులో కేసు కూడా వేసి స్టే తెచ్చాడు.

అనూరాధ ఈజీ చైర్లో కూర్చుంది. తలలో ఏదో పళ్ళ చక్రం తిరుగుతోంది. ఆ పళ్ళ చక్రం కింద చెరుకుగడ జవజవలాడుతూ నలుగుతోంది.

"అబ్బా!" అంటూ రెండు చేతులతో తల పట్టుకొన్నది. తలలో రొద కొంత తగ్గింది.

ఇక తను సందేహిస్తే లాభం లేదు. ఎలాగైనా సరే తన వాళ్ళకు తెలిసేలా చెప్పెయ్యాలి. ఎక్కువ ఆలస్యం చెయ్యకూడదు. ఈ రాత్రికే ఆయనతో చెప్పెయ్యాలి.

"అరే తలుపు వెయ్యలేదు" పైకే అనుకుంటూ లేచి వెళ్ళింది. తలుపు లోపలనుంచి గడియ పెట్టే ఉంది.

ఎందుకు తనకు ఇలాంటి వెధవ సందేహాలు వస్తున్నాయి? ఎందుకేమిటి? ఇవన్నీ పిచ్చికి ముందు ఉండే లక్షణాలే.

"నాకు పిచ్చెక్కేలా ఉందండీ" ఆ రాత్రి భర్తతో అన్నది అనూరాధ. అతని ముఖంలోకి చూసింది.

అతని కనుబొమలు ముడిపడ్డాయి.

"ఆ మాట అనాల్సింది నేను" అన్నాడు.

"ప్రమోషన్ గురించేనా? ఏమైంది?" భర్త కను బొమల్ని చూపుడు వేలితో సర్దుతూ మాట మార్చింది.

"అవును అనూ. చదువుకున్నదానివి, నన్ను అర్థం చేసుకో. ఆఫీసు గొడవల్లో కొంత చిరాకు పడ్తున్న మాట నిజమే. కాని నీకు పిచ్చెక్కించే పనులు నేనేమీ చెయ్యడం లేదే?"

"అది కాదండీ!"

"మీ నాన్న మీ చెల్లెలి పెళ్ళికి అడిగిన అప్పు మొత్తం సర్దలేకపోయాననేగా? నా బ్యాంకు బ్యాలన్సు నీకు తెలియదా?"

"నా మాట వినరేం" ఆమె కంఠం పూడిపోయింది.

"ఇంతమాత్రానికే ఏడుపెందుకూ?"

"నేను ఏడవడం లేదు" ఏడుస్తున్నట్టుగానే అన్నది.

"నాకు విసుగ్గా ఉంది. పడుకో రేపు మాట్లాడుకుందాం" అంటూ పక్కకి తిరిగి పడుకున్నాడు రఘురాం.

ఉన్నట్టుండి మంచంమీదనుంచి దూకినట్టు దిగింది. గదిలోనుంచి పరుగుతీసింది. రఘు చివ్వున లేచి కూర్చున్నాడు.

'ఏమిటలా పరుగు తీసింది. తను ఇప్పుడేమన్నాడని అంత దుఃఖం ముంచుకొచ్చింది? ఈ ఆడవాళ్ళే- కాదు ఈ పిళ్ళాలే ఇంత. మొగుళ్ళ బాధలు చస్తే అర్థం చేసుకోరు.

ఎక్కడికెళ్ళింది? ఏం చేస్తోంది?'

రఘురాం మంచం దిగాడు. డైనింగ్ హాల్లోకి వెళ్ళేసరికి, ఆమె వంటింట్లో లైటు తీసి, తలుపువేసి వస్తోంది.

"ఏమైంది అనూ?"

'గ్యాస్ వాసనొస్తేనూ...'

'గ్యాస్ కట్టెయ్యలేదా?'

'కట్టేశాను'

'లీకవుతోందా?'

'లేదు, బాగానే ఉంది.'

'వాసన వస్తుందంటున్నావ్?' విసుక్కున్నాడు.

'రావడంలేదు, వచ్చింది. అదే నాకు వాసన వచ్చినట్టు అన్పించింది.'

'నీకిదో పిచ్చి, ఈ మధ్య మరీ ఎక్కువైనట్టుంది.'

'అవునండి. నేను చెప్పేది అదే. నాకు ఈ మధ్య పిచ్చెక్కేలా ఉందనే...'

'ఇక చాల్లే పద. ఇప్పుడు నేనేమన్నాను? గ్యాస్ కట్టెయ్యలేదనే భయం ఎక్కువైందన్నాను. అంతేగాని నిజంగా నీకు పిచ్చెక్కిందన్నానా?' విసుగ్గా అని గిర్రున వెనక్కు తిరిగి గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయాడు.

అనూరాధ కొద్ది క్షణాలు మంత్రించిన బొమ్మలా నిలబడిపోయింది. చిన్నగా వెళ్ళి మంచంమీద పడుకొన్నది.

తలలో లావాలాగ ఏదో కుతకుత లాడుతోంది.

ఎలా ఎలా? ఎలా చెబితే ఆయనకు అర్థం అవుతుంది?

రాత్రంతా సీలింగ్ కేసి చూస్తూనే గడిపింది. తెలతెల వారుతూ ఉండగా నిద్రలోకి జారిపోయింది.

అనూరాధ భర్త ఆఫీసుకు వెళ్ళిపోయాడు. పిల్లలు అంతకు ముందే స్కూళ్ళకు వెళ్ళారు.

అన్నం తిన్నాననిపించి కూర్చుంది.

గ్యాస్ ఆర్పలేదనిపించింది. లేచి వెళ్ళింది. గ్యాస్ ఆఫ్ చేసిఉంది. వస్తూ వస్తూ కిటికీలో ఉన్న ఇస్త్రీ పెట్టెను చూసింది. బయటి తలుపు గడియ వేసివుందో లేదో చూసింది.

తన కెందు కిలాంటి అనుమానాలొస్తున్నాయ్?

పాదానికి ఏదో చల్లగా తగిలి త్రుళ్ళిపడి, బలంగా కాలు విదిలించింది.

టామీ 'కుయ్యో కుయ్యో' మంటూ దూరంగా వెళ్ళి నిల్చుని అనూరాధను చూడసాగింది.

అరే టామీనా తాను తన్నింది. దానికి అన్నం పెట్ట లేదు కదూ?

"టామీ! ఏమిటలా చూస్తావ్? నేను పిచ్చిదానిలా కొత్తగా కన్పిస్తున్నాను కదూ? అవును! అందుకే అలా భయం భయంగా చూస్తున్నావు."

టామీ తోక ఆడిస్తూ దగ్గరకొచ్చి కాళ్ళెత్తి వళ్ళో పెట్టి మోర పైకెత్తింది.

'పద నీకన్నం పెడ్తాను' అంటూ వంటింట్లోకి వెళ్ళింది. టామీ కూడా తోకాడిస్తూ వెనకే వెళ్ళింది. పాలన్నం కలిపి బయటకొచ్చి టామీ గిన్నెలో ఆ అన్నం వేస్తుండగా గంట క్రితమే దానికి అన్నం పెట్టినట్టు గుర్తొచ్చింది. టామీ ఒకసారి ఆమె ముఖంలోకి చూసి అన్నపు గిన్నెలో మూతి పెట్టింది.

" నీ దుంపతెగ నన్ను మోసం చేశావుగదూ?" అని తిరిగొచ్చి బద్ధకంగా ఉంటే పడుకొన్నది. వెంటనే నిద్రపట్టింది. మెలకువ వచ్చేసరికి సాయంత్రం ఆరు అయింది. ఇంకా పిల్లలు రాలేదా?

వరండాలోకి వచ్చింది.

టామీ తన దగ్గరకొచ్చింది. తనకేసి ఎందుకలా చూస్తుంది? తనను బోల్తా కొట్టించాననేగా? ఛ! దాని బొంద అది తనను బోల్తా కొట్టించడమేమిటి? పాలన్నంలో కాస్త విషం కలిపి పెట్టినా తినేస్తుంది. ఆ తర్వాత పిచ్చిముండ చచ్చి ఊరుకుంటుంది.

ఛ! ఏమిటి తను ఆలోచిస్తుంది?

తలుపు కొట్టిన శబ్దం. గబగబా వెళ్ళి తలుపు తీసింది. రాకేశ్ ఆమెను తప్పుకొని తన గదిలోకి వెళ్ళాడు.

అనూరాధ వంటింట్లోకి వెళ్ళి రెండు కప్పుల టీ పెట్టింది. డైనింగ్ టేబుల్ దగ్గర టీ తాగుతూ కూర్చుంది. రాకేశ్ తెలివైనవాడు. వాడికి తన బాధ చెప్పుకుంటే అర్థం చేసుకుంటాడు. ఆ తర్వాత వాళ్ళ నాన్నకు అర్థం అయ్యేలా చెబుతాడు. రాకేశ్ వచ్చి మౌనంగా టీ తాగుతున్నాడు.

"రాకేశ్ నాకు పిచ్చెక్కేలా ఉందిరా!"

"అప్పుడే నీదాకా వచ్చిందీ?"

"ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది.

"అదే ఆదిత్య నన్ను కొట్టాడని..."

కొడుకుకేసి అయోమయంగా చూసింది.

'వాడు పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. నేను చూడలేదు. నా కాలు తగిలి కింద పడ్డాడు. లేచి నన్ను కొట్టాడు. కింద పడేలా తోసేశాడు. ఇష్టం వచ్చినట్టు కొట్టి తిడుతూ

వెళ్ళిపోయడు. అక్కడున్న నా క్లాసు మేట్సు నన్ను పిచ్చివాడన్నారు. దెబ్బలు తిని ఊరకుండిపోయినందుకు. నా కాలు తగిలి పాపం పడ్డాడు. అసలే బక్కగా ఉంటాడు. నేను మళ్ళీ కొట్టడం న్యాయమా మమ్మీ? పిల్లలంతా నన్ను ఎగతాళి చేశారు. నేను పిచ్చివాడ్నా మమ్మీ!'

'కాదు బాబూ! నువ్వు మంచివాడివి.'

'నేను తప్పు చేశానా? నీకు కోపం వచ్చిందా?'

' లేదు '

" మరి 'నాకు పిచ్చెక్కేలా ఉంది' అని ఎందుకన్నావ్? నీకు పిచ్చెక్కించే పన్లు నేనేం చేస్తున్నాను మమ్మీ ?" నిలదీసినట్టు అడిగాడు.

ఆమెకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

'చెప్పు మమ్మీ నీకు నామీద ఎందుకు కోపం వచ్చింది:'

'నాకు కోపం లేదు'

'మరి ముఖం అలా పెట్టావేం?'

'ఎలా పెట్టాను?' అంటూ నవ్వింది.

ఆమెకు తన నవ్వు తనకే పిచ్చిదాని నవ్వులా అన్పించింది. రాకేశ్ ముఖంలోకి చూసింది. వాడికి తన నవ్వు మామూలుగానే అన్పించినట్టుంది. వాడిలో ఎలాంటి భావ పరివర్తన కన్పించలేదు.

టీ తాగి కప్పు పెట్టేసి దగ్గరకొచ్చి, తల్లి మెడ చుట్టూ చేతులు వేసి 'మా అమ్మ మంచిది' అన్నాడు.

'సరేలే వెళ్ళి చదువుకో'

'మమ్మీ రాజూ నేనూ సినిమాకు వెళ్తున్నాం' అంటూ సమాధానానికి ఎదురు చూడకుండానే బయటకుపరుగు తీశాడు రాకేశ్.

అనూరాధకు గుండెలు బరువెక్కినయ్. సమత ఇంకా రాలేదు. ఎక్కడకు వెళ్ళింది? ఏదైనా యాక్సిడెంట్ అయిందా? ఛ! అలాంటిదేం లేదు. వట్టి పిచ్చి ఆలోచనలు.

లేచి వంటింట్లోకి వెళ్ళి వంటపనిలో మునిగిపోవడానికి ప్రయత్నించింది. కుక్కర్లో బియ్యం కడిగి నీళ్ళు పోసింది.

కుక్కర్లో నుంచి పొగలొస్తున్నాయ్. మూత ఎగిరి సీలింగ్‌కు తగిలి కిందపడింది. అనూరాధ కెవ్వున అరచింది.

"ఏమిటి మమ్మీ ఏమైంది? అరే కుక్కరు కింద పడి పోయిందే? కాలుమీద పడిందా? దెబ్బ తగిలిందా?"

అనూరాధ ఈ లోకంలోకి వచ్చింది. కుక్కరుకేసి చూసింది. తన కాళ్ళముందు పడివుంది. బియ్యం చిందర వందరగా చిమ్మినట్టు వంటిల్లంతా పడి ఉన్నాయ్. చల్లటి నీళ్ళు కాళ్ళ కిందకు పాకుతున్నాయి. గ్యాస్ పొయ్యికేసి చూసింది. అది ఆమె ముఖంలోకి జాలిగా చూసింది. సమతను చూసింది. సమత కింద కూర్చుని బియ్యం పోగుచేసి కుక్కర్లో పోస్తున్నది. తను కూడా యాంత్రికంగా కూర్చుని బియ్యం తీసి కుక్కరు గిన్నెలో పోస్తున్నది. తను కుక్కర్ పొయ్యిమీద పెట్టనే లేదు. మరి తనకెందుకలా అనిపించింది?

అంత పెద్ద శబ్దం ఎలా విన్పించింది. తను వేసిన కేకే తనకు అలా విన్పించిందా? ఏమో?

"చెయ్యి జారిందా మమ్మీ?"

'సమతా నాకు పిచ్చెక్కేలా ఉందే" జాలి పుట్టే పడే గొంతుతో అన్నది.

సమత చేస్తున్న పని ఆపింది. తలెత్తి తల్లి ముఖంలోకి చూసింది.

'ఏమిటి మమ్మీ నీకు మరీ చాదస్తం ఎక్కువైంది. కాస్త ఆలస్యంగా వస్తే ఇంత అప్ సెట్ కావాలా? నేనేం చిన్నపిల్లనా! రమ తన పుట్టినరోజని వాళ్ళింటికి తీసుకెళ్ళింది. లేకపోతే ఫోన్ చేసి కనుక్కో' చురుగ్గా ఉంది సమత కంఠస్వరం.

అనూరాధ సమతను చూసింది. ఆ పిల్ల కనుబొమ్మలు ముడిపడి ఉన్నాయి. ఆమె చూపుల్ని తిప్పుకొంది.

"అది కాదే..."

"ఏది కాదు మమ్మీ. ఈమాట ఈమధ్య తరచుగా అంటున్నావ్. కొంచెం ఆలస్యంగా వస్తే చాలు ఏదో యాక్సిడెంటయిందని భయం వేస్తుందంటున్నావ్. అసలు నీ భయం అదికాదులే..." రోషంగా అన్నది.

"మరేమిటి!" బేలగా చూసింది కూతురి ముఖంలోకి.

"నీకు నామీద ఏదో అనుమానం పట్టుకుంది. నేనెవడ్తో నైనా తిరుగుతున్నానని నీ అనుమానం. అదేదో స్పష్టంగా చెప్పు" కోపంగా అన్నది సమత.

"అదేమిటే సమతా? అలా నేనన్నానా?" భూమిలోకి దిగబడిపోతున్నట్టుగా అన్నది.

"వేరే అనాలా? మాటకు ముందు 'నాకు పిచ్చెక్కేలా ఉంది' అంటావ్. అలాంటి కాని పనులు నేనేం చేస్తున్నాను?" చేతులకు అంటిన బియ్యాన్ని విదిలిస్తూ, చివ్వున లేచి వెళ్ళి పోయింది సమత.

అనూరాధ అలాగే కూర్చుండిపోయింది.

టామీ వచ్చి తోక ఆడిస్తూ ఆమె చేతిని నాకింది.

ఆమె ఆవేశంగా రెండు చేతుల్తో టామీని పట్టుకుని దగ్గరకు లాక్కుంటూ "టామీ నువ్వే నా బాధ అర్థం చేసుకున్న దానివి" అన్నది పైకే. గట్టిగా పట్టుకోవడం వల్ల టామీ గింజుకొని దూరంగా వెళ్ళి నిల్చొని ఆమెను చూడ సాగింది. టామీ తనను కొత్త మనిషిని చూసినట్టు చూస్తున్నది.

అనూరాధ టామీని చూస్తూ నవ్వింది. 'నన్ను చూస్తుంటే నీకు భయంగా ఉందికదూ?' అన్నది.

టామీ అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. దీనిక్కూడా తనమీద సానుభూతి లేదు. ఎవరికి లేదు. ఇప్పుడే లేదు.

పూర్తిగా పిచ్చెక్కితే? అసలు ఉండదు. తీసుకెళ్ళి ఆసుపత్రిలో పారేస్తారు? తను పిచ్చాసుపత్రిలోనా? నుదుటి మీద స్వేద బిందువులు మెరిశాయి.

రాత్రి భోజనం చేస్తూ తనకు ప్రమోషన్ ఇవ్వమని కోర్టు ఆదేశించిందని ఉత్సాహంగా చెప్పాడు రఘు. అనూరాధ విని ఊరుకుంది. భర్త చెబుతున్నది ఆమె బుర్రకు ఎక్కడం లేదు.

"ఏం అనూ! అలా ఉన్నావ్? నీకు సంతోషంగా లేదా?"

" ఎందుకు లేదూ ?"

"మమ్మీ మారిపోయింది డాడీ" అంటూ ఆ సాయంత్రం జరిగింది తండ్రికి చెప్పింది సమత.

"మీ మమ్మీ పిచ్చిది. అంతమాత్రానికే బాధపడాలా? అయినా ఈ రోజుల్లో ఆడపిల్లల మీద జరిగే అత్యాచారాలు రోజూ పేపర్లలో చూస్తూనే ఉన్నాంగా? అందుకే భయ పడుతోంది" అంటూ కూతుర్ని ఓదార్చాడు తండ్రి.

అనూరాధ మౌనంగా ఉండిపోయింది.

"ఏమిటి అలా ఉన్నావ్?" భార్య అందించిన వక్క పొడిని అందుకుంటూ అడిగాడు రఘు.

ఆమె మాట్లాడలేదు.

" కోపం వచ్చిందా ?"

"ఎందుకూ ?"

"ఇంత పెద్ద రచయిత్రిని పట్టుకొని సమతతో 'మీ అమ్మ పిచ్చిది' అన్నందుకు"

"మీరు ఉన్నమాటే అన్నారు"

"నిజంగానే నీకు పిచ్చెక్కింది" అసహనంగా అన్నాడు రఘు.

'అదేగా నేనూ అంటున్నది. నాకు పిచ్చెక్కుతూ ఉంది.'

'చాల్లే ఇఖ. సర్దాగా అన్న మాటకు ఇంత రాద్ధాంతం? నేను ఎంతో కాలానికి ఉత్సాహంగా ఇంటికొస్తే...'

అయ్యో! మళ్ళీ అదే ధోరణి. ఈయనకు ఎలా చెబితే అర్థం అవుతుంది?

'ప్లీజ్! వినండి. నన్నెవరూ అర్థం చేసుకోవటం లేదు" పెద్దగా పిచ్చిగా అరిచింది అనూరాధ. ముఖం ఎర్రగా చిర్రుగా అయింది.

రఘు బిత్తరపోయాడు.

'మీ ధోరణి మీదే. నిజంగానే నాకు పిచ్చెక్కేలా ఉంది. అన్నీ పిచ్చి ఆలోచనలే. తల పగిలిపోతోంది. అబ్బా!' అంటూ అనూరాధ తలను రెండు చేతులతో గట్టిగా నొక్కుకోసాగింది.

కొద్ది క్షణాలు భర్త భార్యను అయోమయంగా చూశాడు. జాలిగా, బాధగా చూశాడు.

ఆప్యాయంగా రెండు చేతులతో దగ్గరకు తీసుకున్నాడు. ఆమె అతని గుండెల్లో తల దాచుకొని నిండుకుండ బ్రద్దలయి నట్లు బావురుమన్నది. అతను ఆమె వీపు నిమురుతున్నాడు. ఓదారుస్తున్నాడు.

'మీరు అర్థం చేసుకోవడం లేదండీ— నిజంగానే-'

'అర్థం చేసుకున్నాను'

'నిజంగా? ఎప్పుడు?'

'ఇప్పుడే. ఏమైంది నీకు?'

'నాకు భయంగా ఉంది!'

'ఎందుకు?'

'పిచ్చి పడుతుందేమోనని...'

'ఎందుకలా అనిపిస్తోంది?'

"పిచ్చి పిచ్చి ఆలోచనలు. రాకేశ్ చచ్చిపోయినట్టు- సమతను ఎవరో ఎత్తుకుపోయినట్టు – మిమ్మల్నెవరో మర్డర్ చేసినట్టు— నేనే స్వయంగా టామీకి విషం పెట్టినట్టు"

"ఊఁ ఇంకా!"

"ఇస్త్రీపెట్టె బట్టలమీద పెట్టి కరెంట్ ఆఫ్ చెయ్యడం మర్చిపోయినట్టు, గ్యాస్ లీక్ అవుతున్నట్టు లేదా గ్యాస్ ఆర్పడం మర్చిపోయినట్టు..."

రఘురాం ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"ఎంత కాలం నుంచి?"

"మూడు నెలల నుంచి"

"మరి చెప్పలేదేం?"

"చెబుతూనే ఉన్నాను. మీరే– మీరే కాదు పిల్లలు కూడా నన్ను అర్థం చేసుకోలేదు"

రఘురాం ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆమె కేసి జాలిగా చూశాడు.

"ఏమండీ ?"

"ఊఁ"

"నాకు నిజంగానే పిచ్చెక్కుతుందా?"

"ఛ! నీకు పిచ్చెక్కడం ఏమిటి? అలాంటి ఆలోచనలు అప్పుడప్పుడు అందరికి వస్తాయి. జీవితం ఈ రోజుల్లో మెకానికల్‌గా అయిపోయింది. పరుగు. పరుగు. పరుగులో వెనకబడితే ఇలాంటి ఆలోచనలే వస్తాయి.

"నిజంగా ?"

"నిజమే"

"అయితే నాకు పిచ్చెక్కదా?"

'లేదు. పడుకో, నిద్రపో'

'నిద్ర పోవాలంటే ఏదో భయం...'

'నేను కూర్చునే ఉంటాను పడుకో'

ఆమె అతడ్ని ఆనుకొని కళ్ళు మూసుకొని పడుకున్నది. అతను ఆమె ముంగుర్లు సవరిస్తూ కూర్చున్నాడు. ఆమె నిద్ర

పోయింది. అతను భార్య ముఖంలోకి, తల్లి దెబ్బలు తిని ఏడ్చి ఏడ్చి నిద్రపోతున్న బిడ్డను చూసినట్లు చూశాడు.

ఉదయం ఆలస్యంగా లేచి, ఆదరా బాదరా మంచం దిగి బయటికొచ్చింది అనూరాధ.

ఆమె భర్త రాకేష్ స్కూలు బట్టలు ఇస్త్రీ చేస్తున్నాడు.

"ఇదేమిటి మీరు ఇస్త్రీ చేస్తున్నారు?"

'ఏం చెయ్యకూడదా? ఇకనుంచి ఈ పని మా ఎటెండరు చేస్తాడు.'

'ఎటెండరా?'

'అవును నాకు ప్రమోషన్ వచ్చినట్లే. రెసిడెన్షియల్ ఎటెండర్ వస్తాడు. ఎల్లుండి మా అమ్మ వస్తున్నది. అంత వరకు సమత వంట చేస్తుంది.'

'సమత వంట చేస్తుందా?'

" కాఫీ !" సమత తల్లికి కాఫీ కప్పు అందించింది.

'సమతా నువ్వు...'

'అవును మమ్మీ నేనే వంట చే స్తా ను. నాకు వంట చెయ్యడం చాలా ఇష్టం.'

కూతురుకేసి చూసింది.

'మరి నేనేం చెయ్యను?'

'పై విషయాలు చూసుకో. చదువుకో. వ్రాసుకో' అన్నాడు ఆమె భర్త రఘు నవ్వుతూ.

"బాగానే ఉంది వరస!" అంటూ నవ్వింది అనూరాధ.

పది రోజులు గడిచాయి.

అనూరాధకు ఇస్త్రీ చెయ్యాల్సిన పనిలేదు. వంట అత్తగారు చేస్తున్నారు. చెయ్యడమే కాకుండా చిన్నా పెద్ద పనికూడా చూస్తున్నారు.

"అనూ ?"

"ఊఁ"

"ఎలా ఉంది ?"

"ఏమిటి ?"

"నీ మనసు ?" అంతకంటే ఏం చేయాలో తోచడం లేదు అతడికి.

'బాగానే ఉంది. మరీ అంతగా పిచ్చి ఆలోచనలు రావడంలేదు.'

'నువ్వు చదువుకుంటున్నప్పుడు నీ స్నేహితురాలు రాధ కరెంట్ షాక్ కొట్టి చచ్చిపోయింది కదూ?'

'అవును.'

'ఆ మధ్య గ్యాస్ సిలండర్ ప్రమాదంలో చాలా మంది చచ్చిపోయినట్టు వార్తలు వచ్చాయి కదూ? పైగా నీ ఫ్రెండు...'

'ప్లీజ్ అవన్నీ గుర్తుచెయ్యకండి'

'ఆడ పిల్లలకు రక్షణ లేదని రోజూ పేపర్లలో దారుణ మైన వార్తలు చదువుతున్నావు గదూ?'

'అవును.'

'నీకు పెళ్ళయినప్పట్నుంచీ అమ్మ మన దగ్గిరే ఉంది కదూ? ఇంట్లో నువెప్పుడూ ఒంటరిగా లేవు. సంవత్సరం క్రితమే ఆమెకు నీమీద కోపంవచ్చి వెళ్ళిపోయింది అవునా?'

'అవును. ఇవన్నీ ఎందుకడుగుతున్నారు?'

'చెప్తా విను. నీకు కరెంట్ అంటే భయం, గ్యాస్ అంటే భయం, వంటరిగా ఉండాలంటే భయం.'

'అలాంటి భయాలు నాకు లేవే?' సాలోచనగా అన్నది.

'ఆ భయాలు ఉన్నట్టుగా నీకు తెలియదు. నీ సబ్ కాన్షస్ మైండులో ఆ భయాలు దాగిఉన్నాయ్.'

'ఏమో కావచ్చు.'

'కావచ్చు కాదు. అవును. మనసు దారపు వుండ లాంటిది. అప్పుడప్పుడు మనకు తెలియకుండానే చిక్కు పడుతుంది. ఆ చిక్కును చిన్నగా విప్పాలి. దాన్ని లాగితే ఆ చిక్కు గట్టి ముడిగామారి కూర్చుంటుంది. లాగినకొద్దీ పీటముడి అవుతుంది. ఆ ముడి ఎక్కడుందో తెలుసుకొని జాగ్రత్తగా విప్పాలి.'

'ఇవన్నీ మీకు...'

'నేను సైకాలజీ స్టూడెంటును. పైగా సైకియాట్రీ మీద అనేక పుస్తకాలు చదివాను.'

'అందుకే కాబోలు నా బాధను ఇంత త్వరగా అర్థం చేసుకున్నారు' చెప్పుతూ అన్నది.

"అదే ఐరనీ ఆఫ్ ఫేట్ అంటే. అవునుగాని ఈమధ్య నువ్వు బొత్తిగా ఏమీ వ్రాయడం లేదేం? ఏదైనా వ్రాయి. నీ మనసును విప్పడానికి అంతకంటే మంచి మార్గం మరొకటి ఉండదు."

"అవును" నీరసంగా అన్నది. అంతలో ఏదో గుర్తొచ్చి పకపక నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్?"

"ఆ మధ్య జ్యోతి ఎడిటర్ ఫోన్ చేశారు. దీపావళి ఇష్యూకు కథ వ్రాయమని. ఆమె నాకు చాలా సన్నిహితు రాలని మీకు తెలుసు. అందుకే ఆమెకైనా చెబుదామని "నాకు పిచ్చెక్కేలా వుంది" అన్నాను.

"గుడ్. చాలా బాగుంది" అన్నారు ఆమె.

"ఏమిటి బాగుంది?" అన్నాను.

"అదే కథ హెడ్డింగ్ చాలా బాగుంది. అదే వ్రాయండి. టైం లేదు. త్వరగా ఇవ్వాలి. ఎవరో వచ్చినట్టున్నారు. మళ్ళీ ఫోన్ చేస్తాను" అని ఆమె ఫోన్ పెట్టేశారు."

రఘు పక పక నవ్వాడు.

"అప్పుడు నీకేమనిపించింది?" అడిగాడు ఆమె ముఖం లోకి చూస్తూ.

"జుట్టు పీక్కోవాలనిపించింది" అంటూ ఆమె అతని నవ్వులో నవ్వు కలిపింది.

"ఇంకేం! ఇదే వ్రాసి పంపించు" అంటూ విరగబడి నవ్వసాగాడు రఘు.

అనూరాధ మనసు తేలికపడింది.

హాయిగా నవ్వింది.

o o o